క్లుప్తంగా

పైల్స్ సమస్యకు లేజర్ చికిత్స



గుంటూరు మెడికల్: పైల్స్ (మొలలు) సమస్యలకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ల్యాప్రోస్కోపి, లేజర్ చికిత్సలతో ఎలాంటి నొప్పి లేకుండా సమస్యను నివారించవచ్చని సీనియర్ సర్జన్ డాక్టర్ ఉమా శంకర్ అన్నారు. ప్రపంచ పైల్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం గుంటూరు కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు.

26న రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవ ర్యాలీ

లక్ష్మీపురం: ఈనెల 26వ తేదీన రాజ్యాంగ పరిరక్షణ దినం సందర్భంగా గుంటూరులో ర్యాలీ, సభ నిర్వహించనున్నట్లు జిల్లా రైతు సంఘ కార్యదర్శి కంచుమాటి అజయ్ పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి జొన్న శివశంకర్ అధ్యక్షత వహించారు.

శంకర్ విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ కౌలు రైతులకు అందవలసిన గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు అందడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వల్లూరు భారతి, ఆఫీస్ బేరర్స్ తమ్మ ప్రసాద్ రెడ్డి ,మార్పుల వెంగళరెడ్డి పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు...'అభయ'మేదీ...?

- గత ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రారంభించిన అభయం ప్రాజెక్ట్
- గుంటూరులో తొలి దశలో 20 వేల ఆటోలకు ఏర్పాటు సన్నాహం
- ఏర్పాటు చేసింది 1500 లోపు మాత్రమే
- కూటమి సర్కార్‌లో ఆ ఊసే లేదు...



అభయం మిషన్ ఏర్పాటును పరిశీలిస్తున్న గత డీటీసీ కరీం(ఫైల్)



గతంలో ఆటోల్లో అమర్చిన అభయ మిషన్

పట్నంబజారు: ఆడబిడ్డలకు రక్షణగా ఉంటాం.. వారి జోలికి వస్తే సహించం.. ఇదీ నిత్యం కూటమి ప్రభుత్వ పెద్దలు చెప్పే మాటలు. మాటలు కోటలు దాటుతున్నాయే కానీ.. వాస్తవ పరిస్థితుల్లో అందుకు నోచుకోవటంలేదు. పట్టపగలైనా.. అర్ధరాత్రి అయినా.. ఆపత్కర పరిస్థితుల్లో అబలకు అండగా నిలబడాలన్నదే ''అభయం'' లక్ష్యం. మహిళలు, యువతులు, విద్యార్థినులకు సంబంధించి ఏదైనా సమస్యల వాటిల్లితే.. వారికి క్షణాల వ్యవధిలో రక్షణ కలిగించేలా.. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభయం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకారం చుట్టారు.

యాప్ ఉద్దేశం..

ఆడ బిడ్డకు అండగా నిలవాలనే ఉద్దేశంతో గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆటోల్లో అభయం మిషన్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దానిలో తొలుత గుంటూరు, వైజాగ్, విజయవాడ వంటి ముఖ్య ప్రాంతాల్లో ప్రారంభించారు. ఆ ప్రక్రియ పూర్తిగా సఫలం కావటంతో ప్రతి ఆటోలో బిగించేలా దృష్టి సారించారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేలకుపైగా ఆటోలు ఉన్నాయి. తొలుత 20 వేల ఆటోలకు బిగిద్దామని అనుకున్న నేపథ్యంలో గుంటూరు నగరం నుంచి ప్రారంభించిన అప్పటి డీటీసీ షేక్ కరీం ఆధ్వర్యంలో సుమారు 1500 మిషన్‌ల వరకు ఆటోల్లో ఏర్పాటు చేశారు. మహిళలకు భద్రతే ప్రధాన లక్ష్యంగా అభయం పరికరాన్ని ఆటోల్లో అమర్చారు. ఈ క్రమంలో ఎన్నికల హడావుడి ప్రారంభం అవ్వటంతో అభయం మిషన్‌ల ఏర్పాటుకు కొంత మేరకు ఆలస్యమైంది.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో...

అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ట్రాకింగ్ పరికరాన్ని ఆటోల్లో అమర్చుతారు. వాహనానికి క్యూఆర్ కోడ్ అమర్చుతారు. దీనితో పాటుగా వాహనాన్ని స్టార్ట్ చేసే సమయంలో డ్రైవర్ తనకు జారీ చేసిన స్మార్ట్ డ్రైవింగ్ లైసెన్స్ ఐఓటీ డివైస్ పరికరం వద్ద ట్యాప్ చేయగానే డ్రైవర్ వివరాలన్నీ అభయ పరికరంలో నిక్షిప్తమవుతాయి. ఆటో ఎక్కిన తరువాత దారి తెలియని ప్రయాణికులు వారు ప్రయాణిస్తున్న వివరాలను సన్నిహితులకు పంపటం ద్వారా ఎటు ప్రయాణం అవుతాన్నారో తెలుస్తోంది. స్మార్ట్ ఫోన్ ఉన్న యాప్‌లో గమ్యస్థానాన్ని నమోదు చేస్తే.. వెళ్ళాల్సిన మూడు దారులు కనపడతాయి. ప్యాసింజర్ ట్రిప్‌ను అంగీకరించగానే ట్రిప్ ట్రాక్ అవటం మొదలుపెడుతుంది. నమోదు చేసిన రూట్లు కాకుండా వేరే రూటుకు వెళ్లినా.. డ్రైవర్ ప్రవర్తన సరిగా లేకపోయినా.. పరికరంలోని ప్యానిక్ బటన్ నొక్కగానే.. సెకన్ల వ్యవధిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళుతుంది. ప్యానిక్ బటన్ నొక్కిన సుమారు 100 మీటర్ల దూరంలోనే ఆటో నిలిచి పోతుంది. దీనితో తక్షణమే సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది ట్రిప్‌లో ఉన్న డ్రైవర్ ఫోన్ నంబర్‌కు నేరుగా ఫోన్ చేస్తారు. తమకు ప్యానిక్ బటన్ ద్వారా సమాచారం అందిందని, తక్షణమే ఫోన్‌ను వాహనంలో ఉన్న ప్రయాణికులకు ఇవ్వాలని ఆదేశిస్తారు. పొరపాటున నొక్కారా.. లేక ఆపదలో ఉన్నారా.. డ్రైవర్ దురుద్దేశంతో ఏదైనా కావాలని రూటు మార్చి వెళుతున్నాడా.. అని ప్రయాణికులనే నేరుగా కనుక్కుంటారు. డ్రైవర్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటే దగ్గర్లోని పోలీసుస్టేషన్‌కు కమాండ్ కంట్రోల్ రూము నుంచే సమాచారం అందుతుంది. జీపీఎస్ లోకేషన్ ట్రాకింగ్ ద్వారా మహిళ, యువతి, విద్యార్థిని, బాలికలను రక్షించే అవకాశం ఉంటుంది. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

క్యూఆర్ స్కానింగ్‌లోనే అన్ని వివరాలు...

అభయం ప్రాజెక్టు కింద ఆటోల్లో పరికరం బిగించే సమయంలో ఇంజన్‌కు కనెక్షన్ ఇస్తారు. దీనితో జీపీఎస్ ట్రాకింగ్‌తో పాటు, ప్యానిక్ బటన్ ఉంటాయి. ప్రయాణికురాలు ఆటో ఎక్కే ముందు ఫోన్‌లో ప్లే స్టోర్ ద్వారా అభయం యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని, ఆటోపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. ఆటో నంబర్, డ్రైవర్ ఫొటో, అతని పేరు, సెల్ నంబర్‌లు అందులో వచ్చేస్తాయి. త్వదారా అసలు ఆటోలో ఉన్న వ్యక్తి సరైన వాడు అవునా.. కాదా అనే నిర్ధారించుకోవచ్చు.

కాంట్రాక్ట్.. చెల్లించకపోవటంతోనే..

మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేయదలిచిన అభయం యాప్‌కు సంబంధించి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్‌లు చెల్లించకపోవటంతోనే మిషన్‌ల ఏర్పాటు జరగటం లేదని తెలుస్తోంది. దీనిపై కనీసం ఇప్పటి వరకు జిల్లా ఉన్నతాధికారులు, ఆర్టీఓ, ప్రజాప్రతినిధులు సమీక్షించిన పాపాన పోకపోవటం గమనార్హం. ఇప్పటికైనా మహిళ రక్షణకు ఉపయోపడే అభయ యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తారో.. లేదో వేచి చూడాల్సిందే...?

మనకు ఎటువంటి ఆదేశాలు లేవు



అభయ ప్రాజెక్టు సంబంధించి మాకు ఎటువంటి ప్రభుత్వ ఆదేశాలు అందలేదు. గతంలో వైజాగ్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రారంభించిన మాట వాస్తవమే. అయితే ఫండ్స్ రిలీజ్ కాకపోవటంతో సదరు కాంట్రాక్టర్ మిషన్స్‌లను జారీ చేయకుండా నిలిపివేశారు. ప్రభుత్వ ఆదేశాలు వెలువెడగానే దానిపై దృష్టి సారిస్తాం. -కె.సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు జిల్లా

జీఓ నంబర్ 154 అమలు చేయండి



గుంటూరు వెస్ట్: జీఓ నంబర్ 154 అమలు చేసి అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు ప్రసన్న కుమార్, డీఆర్వో ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వోను కలిసి సత్కరించారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గత 8 నెలల నుంచి అనర్హులను పదవుల్లోనే కొనసాగిస్తున్నారన్నారు. గతంలో ఎన్నోసార్లు వినతిపత్రాలు అందచేసినా ఫలితం లేదన్నారు. జీఓ 166 ప్రకారం 2వ గ్రేడ్ వీఆర్వో నుంచి సీనియారిటీ ప్రకారం 1వ గ్రేడ్ ప్రమోషన్ కల్పించాలన్నారు. అసోసియేషన్ నాయకులు సిహెచ్ లూర్దురాజు, సిహెచ్.అనిల్ కుమార్, జి.రమాదేవి, కె.రమేష్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



నగరంపాలెం: పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. గుంటూరు నగరంలోని దాక్షిణ్యా స్పెషల్ స్కూల్ ఫర్ ఇంటలెక్చువల్ డిసేబిల్డ్ అండ్ దాక్షిణ్యా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లల ఆరోగ్యంపై వాకబు చేశారు. పిల్లల అందరికి జీజీహెచ్ వైద్యులు వైద్య పరీక్షలు చేపట్టారు. ఏవైనా సమస్యలు ఉన్నట్‌లెతై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయం పొందేందుకు అవకాశాలు ఉన్నాయని కార్యదర్శి లీలావతి తెలిపారు. జీజీహెచ్ వైద్యులు నిర్మల, జ్యోత్స్న, రజనీకాంత్ పాల్గొన్నారు.

సీఓపీడీపై అప్రమత్తంగా ఉండాలి



గుంటూరు మెడికల్: చలికాలంలో ఎక్కువ ఇబ్బందికి గురిచేసే క్రానిక్ అబ్‌స్ట్రక్టీవ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష్ వీర్నాల అన్నారు. వరల్డ్ సీఓపీడీ డే సందర్భంగా బుధవారం స్థానిక కొత్తపేట శివాలయం పక్కన ఉన్న ఆధునిక మల్టీస్పెషాలిటీలో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ పంతగాని యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన తర్వాతే బిల్లులు చెల్లింపు

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులకు తగు సూచనలు చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు నేరుగా పరిశీలించిన తర్వాతనే బిల్లుల చెల్లింపునకు ప్రాసెస్ చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నల్లకుంట, రామిరెడ్డి నగర్, రవీంద్ర నగర్, శ్యామల నగర్, పట్టాభిపురం, రత్నగిరీ నగర్, జన్మభూమి నగర్ తదితర ప్రాంతాల్లో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లను బుధవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. పనులు జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు అక్కడే ఉండి పనులను పరిశీలించాలని స్పష్టం చేశారు. పనులను ప్రత్యక్ష పరిశీలన చేసిన అనంతరం బిల్లుల చెల్లింపునకు ప్రాసెస్ చేస్తామన్నారు. రామిరెడ్డి నగర్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్ల మీదకు ర్యాంప్‌లు ఉండడం, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్ల పక్కన ఉండడంపై స్థానికుల ఫిర్యాదు మేరకు స్థానిక 94 వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి ఎస్‌కే అస్మాకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం తమ సచివాలయం పరిధిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల్లో స్థానిక వాకర్స్ అసోసియేషన్ భాగస్వామ్యం కావాలని కోరారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు మధుసూదన్, రమేష్ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి రోజు వంద కుక్కలకు ఆపరేషన్లు చేయాలి

ఏబీసీ సెంటర్‌లో ప్రతి రోజు వంద వీధి కుక్కలకు తగ్గకుండా ఆపరేషన్లు చేయాలని, అందుకు తగిన మౌలిక వసతులను జీఎంసీ కల్పించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. నల్లచెరువు రోడ్డులోని జీఎంసీ ఏబీసీ సెంటర్‌ని, కేవీపీ కాలనిలోని వెహికిల్ షెడ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, డీఈఈ సతీష్ కుమార్, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్ పాల్గొన్నారు.

శంకర్‌విలాస్ బ్రిడ్జ్ నిర్మాణానికి సహకరిస్తాం

నగరవాసుల చిరకాల వాంఛ శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి అనుమతులు రావడం సంతోషకరమని, నిర్మాణానికి సంపూర్ణంగా సహకరిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. ఏఈఎల్‌సీ, ఆర్‌సీఎం సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తొలుత ఆర్ అండ్ బీ అధికారులు ఆర్వోబీ ప్లాన్‌ని, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు ప్రభావిత భవనాల వివరాలు, జీఎంసీ నుంచి అందించే నష్ట పరిహారం వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న శంకర్ విలాస్ ఆర్వోబీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపినందున రోడ్డు విస్తరణను 120 అడుగులకు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే అరండల్ పేట, బ్రాడీపేట వైపు ప్రభావిత భవనాల యజమానులతో సమావేశమం నిర్వహించినట్లు తెలిపారు. ఆయా సంస్థలకు చట్టపరంగా అందాల్సిన నష్ట పరిహారాలను త్వరితగతిన అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయుల సీపీఎస్ ఖాతాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న రవిసాగర్, ధర్మకుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్–3 పరిధిలోని మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్స్‌కు సంబంధించిన సీపీఎస్ ఖాతాల రికార్డుల పరిశీలన ప్రక్రియ బుధవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌వీ రవిసాగర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల జీతభత్యాలు సొసైటీ పరిధిలో ఉండేవని, ఈ ఏడాది జూలై నుంచి వారికి 010 పద్దు నుంచి చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. జోన్–3 పరిధిలోని 32 మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులకు సంబంధించి 2021 డిసెంబర్ నుంచి సీపీఎస్ అమలు తీరును పరిశీలించినట్లు వివరించారు. సంబంధిత మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ప్రిన్సిపాల్స్ తమ వేతనంలో నుంచి సీపీఎస్ చందా మినహాయించి జమ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్స్ కార్యాలయ ఏఎంవో డాక్టర్ కె. ధర్మకుమార్. ఏవో బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రమేష్ ఆస్పత్రిపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

లక్ష్మీపురం: నగరంలోని ఆస్టర్ రమేష్ ఆస్పత్రి ఐదో అంతస్తు నుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటీ అగ్రహారానికి చెందిన పరంగి సత్యరాజు కుమారుడు సాయి వేణుచంద్ర(34) మానసిక వైకల్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మృతుడి తండ్రి సత్యరాజు, రమేష్ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకున్నాడు. పది రోజుల పాటు తండ్రితోనే సాయి ఉన్నాడు. ఆ తరువాత నుంచి కూడా పలుమార్లు రమేష్ ఆస్పత్రికి వెళ్లి, సెక్యూరిటీ ఉద్యోగం కావాలని అడిగాడు. అయితే గత కొంత కాలంగా కొత్తపేటలోని మానసిక వైద్యుడి వద్ద చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఆస్టర్ రమేష్ ఆస్పత్రికి వెళ్లి భవనం కిందకి దూకాడు. కిందకు దూకిన సాయిని ఆస్పత్రి సిబ్బంది అత్యవసర విభాగానికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు అత్యవసర సేవలు చేస్తుండగానే చికిత్స పొందుతూ సాయి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఆస్పత్రితో తమ బిడ్డ సాయి ఆత్మహత్య చేసుకోవడంపై న్యాయం చేయాలని ఆస్టర్ రమేష్ ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీశారు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ నాయకుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లి ఆస్పత్రి నిర్వాహకులతో, నగరంపాలెం సీఐతో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

గ్రంథాలయాల ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని పొందవచ్చు

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి
- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



దాక్టర్ రమణ యశస్విని సత్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని పొందవచ్చునని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ సమన్వయకర్త పి.వేణుగోపాల్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ సీహెచ్ అరుణ, గ్రంథాలయ విభాగాధిపతి డీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

- అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వంకదారు సుబ్బరత్నమ్మ, కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు, ఉప గ్రంథ పాలకురాలు కె.రూసీస్లలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ పి.సీతారామయ్య, గ్రంథ పాలకులు కె.చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు పక్కన పెట్టి పుస్తకాన్ని చదవాలి

విద్యార్థులు, యువతరం సెల్‌ఫోన్లు పక్కన పెట్టి పుస్తకాన్ని చదవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోత్స్నకుమారి, ఏఎన్‌యూ దూరవిద్య కేంద్ర డైరెక్టర్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు పాఠకులు, విద్యార్థులతో గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. మానవత సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, గ్రంథ పాలకుడు ఎస్.వెంకటేశ్వరరావు, మానవత సంస్థ కార్యదర్శి కె. సతీష్‌కుమార్, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

- బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది మొవ్వా మృత్యుంజయరావు, సాహితీవేత్త ఏవీకే సుజాత, సాంఘిక సంక్షేమ శాఖాధికారి వై.మల్లికార్జునరావు పాల్గొన్నారు.
- ఎస్వీఎన్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వారం రోజులపాటు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థినులు ఎన్‌సీసీలో చేరాలి

గుంటూరు ఎడ్యుకేషన్: బాలురతోసమానంగా విద్యార్థినులు ఎన్‌సీసీలో చేరాలని ఎన్‌సీసీ ప్రాంతీయ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్వీఎస్ సుదర్శన్ పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బుధవారం బాలికల జూనియర్ వింగ్ ఎన్‌సీసీ ఉప విభాగాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గుంటూరు పర్యవేక్షణాధికారి కొల్లా రాజశేఖరబాబు, భారతీయ విద్యాభవన్ ముఖ్య కార్యదర్శి పి.రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ ఎస్.హేమాంబ, ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పట్నంబజారు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు అయింది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. సంపత్ నగర్‌కు చెందిన చెక్క రామకృష్ణ(50) బుధవారం మధ్యాహ్నం సమయంలో పనుల నిమిత్తం చుట్టుగుంట మీదుగా మార్కెట్ యార్డు వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో వెనక నుండి వచ్చిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

లక్ష్మీపురం: హత్య కేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన షేక్ గౌస్(54), గుజ్జనగుండ్ల ప్రాంతానికి చెందిన ఆకుల సాంబయ్య ఇద్దరూ స్నేహితులు. ఇద్దరు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ప్రతి రోజు ఇద్దరు జేకేసీ నగర్ ఒకటో లైన్ దుకాణాల అరుగుల మీద నిద్రపోతూ ఉంటారు. అయితే ఈనెల 12వ తేదీన రాత్రి ఇద్దరు మద్యం తాగారు. సాంబయ్య, మృతుడు గౌస్‌ను స్థానికంగా ఉండే వారికి రూ.10 నుంచి 20 వడ్డీకి అప్పుగా ఇవ్వడం సరి కాదని హెచ్చరించాడు. గౌస్ మద్యం మత్తులో ఆకుల సాంబయ్యను బూతులు తిట్టాడు. దీంతో ఆకుల సాంబయ్య, గౌస్ తీసుకున్న డబ్బులు ఇవ్వాల్సిందిగా నిలదీశాడు. ఇద్దరి మధ్య వాదన జరిగింది. కోపం పెంచుకున్న సాంబయ్య, ఆరుగుపై నిద్రిస్తున్న గౌస్ తలపై రాయితో కొట్టి హతమార్చి, అక్కడ నుంచి పరారయ్యాడు. సీసీ ఫుటేజ్ ద్వారా సాంబయ్యను అదుపులో తీసుకుని, ఇన్‌చార్జి సీఐ వీరయ్య చౌదరి విచారించారు. గౌస్‌ను హత మార్చినట్టు అంగీకరించాడు. దీంతో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.